సాక్షి ఆదిలాబాద్


బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025

ఆత్మహత్యే పరిష్కారం కాదు..

క్షణికావేశంలో కొంత మంది ఆత్మహత్యే శరణ్యం అనుకుంటున్నారు. ఈ క్రమంలో బలన్మరణానికి పాల్పడుతున్నారు.



8లో▸



'నానో'పై అవగాహన ఏది?

నానో యూరియా అందుబాటులోకి వచ్చినా అన్నదాతల్లో సరైన అవగాహన లేకపోవడంతో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

జిల్లా ఆడిట్ అధికారికి పదోన్నతి



సర్వయ్యను సన్మానిస్తున్న డీసీవో, ఉద్యోగులు

కైలాస్‌నగర్: జిల్లా సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్, ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న జే.నర్సయ్యకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన్ను నిర్మల్ జిల్లా సహకారశాఖ అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను జిల్లా సహకార అధికారి బి.మోహన్, టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నవీన్ కుమార్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు ముజఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ వర్ధంతి

కైలాస్‌నగర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని ఈ నెల 10న అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఎదుట గల ఐలమ్మ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, బీసీ సంఘాల నాయకులు, రజక కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి రూ.13.78 కోట్లు విడుదల

ఆదిలాబాద్: జిల్లాలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.13.78 కోట్లు విడుదలైనట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. కొన్నేళ్లుగా గ్రామాల్లో మురుగు కాలువలు, రోడ్ల అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు నిధుల విడుదలకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ మేరకు నిధులు విడుదల కావడంతో అభివృద్ధి పనులకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నేడు జీపీవోల కౌన్సెలింగ్

కైలాస్‌నగర్: రెవెన్యూ శాఖలో కొత్తగా నియామకం కానున్న గ్రామ పాలన అధికారుల(జీపీవో) పోస్టింగ్‌కు సంబంధించి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లాలో రెండు విడతల్లో నిర్వహించిన పరీక్షల్లో 83 మంది అర్హత సాధించిన విషయం తెలిసిందే. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో వీరికి కౌన్సెలింగ్ నిర్వస్తారు. మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కాగా, నిర్మల్ జిల్లా నుంచి తొలుత 10 మందిని జిల్లాకు సర్దుబాటు చేసినప్పటికీ వారిని రద్దు చేశారు.


న్యాయవాదుల విధుల బహిష్కరణ



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌టౌన్: న్యాయవాదులపై దాడులు పునరావృతం కాకుండా రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్ డిమాండ్ చేశారు. ఓ కేసు విషయంలో ఎన్‌బీడబ్ల్యూ నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన ఆదిలాబాద్ న్యాయవాదులు కౌషిక్ సింగ్, మనోజ్‌పై నిందితులు దాడి చేయడాన్ని ఖండించారు. ఈమేరకు మంగళవారం విధులు బహిష్కరించి జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీకాంత్, ప్రవీణ్‌రెడ్డి, మహేందర్, సద్దాం, భావన సింగ్, మహేశ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం



నివాళులర్పిస్తున్న కవులు

ఆదిలాబాద్: కాళోజీ జయంతి పురస్కరించుకుని జిల్లాకు చెందిన కవులు, సాహితీ ప్రేమికుల ఆధ్వర్యంలో మంగళవారం కవి సమ్మేళనం నిర్వహించారు. కలెక్టరేట్‌చౌక్‌లో కాళోజీ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. కాళోజీ ప్రజాస్వరంగా మారి తెలంగాణ సంస్కృతి, విలువలను చాటారని కొనియాడారు. కార్యక్రమంలో కవులు బాలసాని నారాయణగౌడ్, ఉదారి నారాయణ, అల్లూరి భూమన్న, కే.లింగన్న, ప్రశాంత, వరప్రసాద్, రవికాంత్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భోరజ్ మండలం తర్నం వాగు వద్ద లోలెవల్ వంతెన పైనుంచి మంగళవారం భారీ వాహనాలు మహారాష్ట్ర వైపు వెళ్తున్న చిత్రమిది. ఇప్పుడైతే ఈ వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండగా, భారీగా వరద వస్తే మాత్రం కష్టమే. ఇరువైపులా బారులు తీరాల్సిందే. భోరజ్ నుంచి జైనథ్, బేల మీదుగా మహారాష్ట్ర వైపు వెళ్లేందుకు ఈ జాతీయ రహదారే ప్రధానం. హైలెవల్ వంతెన ఇక్కడ నిర్మించాల్సి ఉండగా, పనుల ప్రారంభంలో అంతులేని జాప్యం వాటిల్లుతోంది. ఇక్కడ ఉన్న పాత వంతెన శిథిలావస్థకు చేరగా దానిని కూల్చి కొత్త వంతెన నిర్మించతలపెట్టారు. అయితే నిర్మాణంలో ఆలస్యం అవుతుండడంతో కొన్నేళ్లుగా ఈ రహదారిపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం వరద ప్రవహిస్తుండడంతో పనులు ఇంకా ప్రారంభించలేదు.



గడువులోపు పూర్తయ్యేనా?

NH 353B

- కొనసా..గుతున్న ఎన్‌హెచ్ 353(బి) నిర్మాణ పనులు
- వచ్చే ఏడాది మే వరకు గడువు
- తర్నం వద్ద మరూ కాని 'హైలెవల్'
- తాత్కాలిక వంతెనపై రాకపోకలకు ఇబ్బంది
- భోరజ్ వద్ద వీయూపీకి లభించని గ్రీన్‌సిగ్నల్



జిల్లా పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనులు

సాక్షి,ఆదిలాబాద్: జాతీయ రహదారి 353(బి) నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కేవలం 33 కిలో మీటర్ల పరిధిలో ఎన్‌హెచ్ నిబంధనలకు అనుగుణంగా ఈ డబుల్‌లేన్‌ను పటిష్టపర్చాల్సి ఉండగా, నిర్మాణ పనులు ఆలస్యంగా సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో పనులు ప్రారంభం కాగా, వచ్చే ఏడాది మే లోగా పూర్తి చేయాలి. అయితే ఆశించిన స్థాయిలో పనులు పూర్తి కావడం లేదు. విస్తరణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. తర్నం వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఇంకా అడుగే పడలేదు. భోరజ్ వద్ద మరో వెహికిల్ అండర్‌పాస్ (వీయూపీ) నిర్మాణానికి ఇంకా అన్ని అనుమతులు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గడువులోపు పనులు పూర్తయ్యేది అనుమానంగానే కనిపిస్తోంది.

ఎన్‌హెచ్‌గా అప్‌గ్రేడ్..

నాలుగున్నరేళ్ల క్రితం అంతర్రాష్ట్ర రహదారిగా ఆర్ అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ నేపథ్యంలో ఫోర్‌లేన్‌గా విస్తరిస్తారని పేర్కొన్నప్పటికీ ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ పరిగణలోకి తీసుకొని చివరికి డబుల్ లేన్‌నే మరింత విస్తరించి ఎన్‌హెచ్ నిబంధనలకు అనుగుణంగా పటిష్టపర్చాలని నిర్ణయం తీసుకున్నారు. గతేడాది మొదట్లో ఔరంగాబాద్‌కు చెందిన ఆర్‌బీ ఘోడ్కే కాంట్రాక్ట్ సంస్థ ఈ పనులను దక్కించుకుంది. మొత్తంగా సర్వే, టెండర్, అగ్రిమెంట్.. ఇలా ప్రతీ అంశంలో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో పనుల ప్రారంభమే ఏళ్లకేళ్లు పట్టింది. ఎట్టకేలకు గతేడాది ప్రారంభించినప్పటికీ వేగిరంగా పనులు చేపట్టడంలో కాంట్రాక్టర్ విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మహారాష్ట్ర నుంచి మొదలుకుంటే..

మహారాష్ట్రలోని ఆష్టి నుంచి ఆదిలాబాద్ జిల్లా భోరజ్ వరకు నిర్మిస్తున్నారు. అక్కడి నుంచి ఇక్కడి వరకు 141కిలోమీటర్లు ఉండగా, జిల్లాలో 33 కిలోమీటర్లు మాత్రమే వస్తుంది.మహారాష్ట్ర ప్రాంతంలో ఎన్‌హెచ్ఏఐ నిర్మాణం పూర్తి చే యగా అక్కడ ఫోర్‌లేన్‌గా విస్తరించారు. తెలంగాణలో ఎన్‌హెచ్ నిర్మిస్తుండగా, ఇక్కడ మాత్రం డబుల్ లేన్‌నే పటిష్టపరుస్తున్నారు. భారతమాల కింద ఈ జాతీయ రహదారికి అంకురార్పణ జరిగింది. కేంద్రం నిధులతో దీన్ని నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఎన్‌హెచ్‌కు అమలు బాధ్యత అప్పగించారు.

రోడ్డు వివరాలు..

అంచనా వ్యయం: రూ.490 కోట్లు (భూ సేకరణకు కలిపి)
రోడ్డు నిర్మాణ వ్యయం : రూ.360 కోట్లు
కాంట్రాక్ట్ సంస్థతో అగ్రిమెంట్ : 46 శాతం లెస్ రూ.194 కోట్లతో..

స్వరూపం ఇలా..

- జైనథ్, బేల,నిరాల, బెల్గాం వద్ద మొదట సర్వీస్ రోడ్లు నిర్మిస్తారని పేర్కొన్నారు. తర్వాత మార్పులు చేశారు. అక్కడ జనసంచారం అధికంగా ఉన్న దృష్ట్యా ఫోర్‌లేన్‌గా విస్తరిస్తున్నారు. మొత్తం 20 మీటర్ల రహదారి చేపడుతుండగా, ఇరువైపులా 10 మీటర్ల చొప్పున రహదారి ఉంటుంది. మధ్యలో 1.5 మీటర్లలో డివైడర్ నిర్మిస్తున్నారు. స్ట్రీట్‌లైట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.
- తరోడా (తర్నం)గ్రామం వద్ద హై లెవల్ బ్రిడ్జి 11 మీటర్ల రహదారి పోర్షన్‌తో నిర్మించనున్నారు. ఇందులో 1.6 మీటర్ల ఫుట్‌పాత్ రెండువైపులా వస్తుంది.
- భోరజ్ వద్ద మరో వెహికిల్ అండర్ పాస్ నిర్మించాల్సి ఉంది. దీనికి సంబంధించి భోరజ్ వద్ద ఒక హెక్టార్ భూ సేకరణ చేస్తున్నారు. 12 మీటర్ల విస్తీర్ణంలో ఈ వీయూపీ ఉండనుంది. ఇది ఎన్‌హెచ్ఏఐ 44 దిగువన ఉండడంతో ఈ నిర్మాణానికి సంబంధించి అనుమతి నివేదించగా గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంది.

గడువులోపు పూర్తికి చర్యలు

ఈ పనులను వచ్చే ఏడాది మే లోగా పూర్తి చేస్తాం. ప్రస్తుతం వరద తీవ్రత నేపథ్యంతో ఇంకా హైలెవల్ వంతెన పనులు ప్రారంభించలేదు. ఇప్పటివరకు 33 కిలోమీటర్లలో 26 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జికి సంబంధించి డిజైన్ పూర్తి చేశాం. ఇక నిర్మాణ పనులపై దృష్టి సారిస్తాం.
– సుభాష్, డీఈ, ఎన్‌హెచ్

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ రాజర్షి షా



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: తన రచనల ద్వారా ప్రజా హక్కుల కోసం ఉద్యమించిన పోరాటయోధుడు కాళోజీ నారాయణరావు అని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాకవి కాళోజీ జయంతిని జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారికంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు, ఉద్యోగులతో కలిసి ఆయన కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ మాండలికానికి కాళోజీ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, జిల్లా సహకార అధికారి మోహన్, సీపీవో వెంకటరమణ, కలెక్టరేట్ ఏవో వర్ణ తదితరులు పాల్గొన్నారు.

'భూభారతి'పై దృష్టి సారించాలి

కైలాస్‌నగర్: భూభారతి పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించి, పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని తహసీల్దార్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సాదాబైనామా, అసైన్డ్‌లాండ్‌కు సంబంధించిన దరఖాస్తులు, అందులో నోటీసులు ఇచ్చి సర్వేప్రక్రియ పూర్తి చేసిన, పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భూ రికార్డులను ప్రామాణికంగా రూపొందించాలన్నారు. ఈనెల 11న జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటనను విజయవంతం చేసేలా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. భోరజ్ మండలం పిప్పర్‌వాడలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో మంత్రి పాల్గొంటారన్నారు. అలాగే బోథ్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లో పలు కార్యక్రమాలతో పాటు కలెక్టరేట్ సమావేశ మందిరంలో రివ్యూ మీటింగ్ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, కలెక్టరేట్ ఏవో వర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఉట్నూర్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

ఉట్నూర్‌రూరల్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని, ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. నేరాల నియంత్రలో భాగంగా ఉట్నూర్, ఇంద్రవెల్లి మండల కేంద్రాల్లో 50 సీసీ కెమెరాలతో పాటు ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఏఎస్పీ కాజల్ సింగ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఐటీడీఏ పీవో సహకారంతో ఉట్నూర్‌లో 37, ఇంద్రవెల్లిలో 13 సీసీ కెమెరాలను ప్రధానమైన కూడళ్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక సిబ్బంది 24 గంటలు పర్యవేక్షిస్తారని తెలిపారు. దీంతో ఉట్నూర్, ఇంద్రవెల్లి ప్రాంతాలు ఇక నిఘా నీడలో ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, నార్నూర్ సీఐ ప్రభాకర్, ఎస్సైలు ప్రవీణ్, అఖిల్, మనోహర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడంపై సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్‌ను సన్మానించారు. అలాగే ఏఎస్పీ సురేందర్‌రావును సత్కరించారు. ఇందులో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రతినిధులు సూర్యకాంత్, రవీందర్, ప్రేమ్‌సింగ్, మహిపాల్, రాజు, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

వాగు దాటి.. పరామర్శించి



వాగు దాటుతున్న డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది



ప్రియాంకతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

- నవజాత శిశువు మృతిపై ఆరా
- భగవాన్‌పూర్‌లో పర్యటించిన డీఎంహెచ్‌వో

భీంపూర్: మండలంలోని భగవాన్‌పూర్ గ్రామంలో నవజాత శిశువు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు కలెక్టర్ రాజర్షి షా ఆదేశానుసారం డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, పంచాయతీరాజ్ డీఈఈ శివరాం నాయక్ మంగళవారం గ్రామంలో పర్యటించారు. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో కాలినడకన వెళ్లారు. వాగు దాటి గ్రామానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న నవజాత శిశువు తల్లి ప్రియాంక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రూహిదాస్, మేఘ, ఎంఎల్‌హెచ్‌పీ మాయావతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే సీసీఐపై కదలిక



నినాదాలు చేస్తున్న సాధన కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: సీసీఐ పునఃప్రారంభించాలని మూడేళ్లుగా సీసీఐ సాధన కమిటీ నిర్విరామంగా పోరాటం చేసిందని సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోరాట ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కదలిక వచ్చిందన్నారు. సానుకూల నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఢిల్లీకి వెళ్లి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసినట్లు తెలిపారు. సీసీఐని ప్రభుత్వ సంస్థగానే కొనసాగించాలని, కేంద్రం ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. త్వరలోనే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఇందులో ఇజ్జగిరి నారాయణ, రమేశ్, దత్తాత్రి, వెంకటనారాయణ, జగన్‌సింగ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో 'క్యాన్సర్ డే కేర్' సేవలు

- డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



క్యాన్సర్ డే కేర్ సెంటర్ ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నామని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ డే కేర్ సెంటర్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ క్యాన్స ర్ బాధితులకు రిమ్స్‌లో కిమో థెరపీ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాల ని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చందు, దీపక్ పుష్కర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుకు చేరని చేప

- 'మీనం' టెండర్లలో తీవ్ర జాప్యం
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఈనెల 12 వరకు 'మూడోసారి' అవకాశం
- ఇప్పటికే చేపపిల్లల పంపిణీ ఆలస్యం
- మత్స్యకారులకు తప్పని నిరీక్షణ

జిల్లాలో..
మత్స్యపారిశ్రామిక సంఘాలు : 107
ఆయా సంఘాల్లోని సభ్యులు : 5,040 మంది
మొత్తం చెరువులు : 224
ప్రాజెక్టులు : 2(సాత్నాల, మత్తడివాగు)
చేప పిల్లల పంపిణీ లక్ష్యం : 1.16కోట్లు
35–40 ఎంఎం సైజ్ : 83 లక్షలు
90–100 ఎంఎం సైజ్ : 33లక్షలు



కైలాస్‌నగర్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది జిల్లాలోని మత్స్యకారుల పరిస్థితి. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. వాటిలో చేపపిల్లలను వదిలేందుకు అనుకూలమైన పరిస్థితులున్నాయి. అయితే సీడ్ సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం వారిని నిరాశకు గురిచేస్తోంది. ముచ్చటగా మూడోసారైనా టెండర్లు ఖరారై మీనం త్వరగా చెరువుకు చేరుతుందా.. లేక మళ్లీ వాయిదా తప్పదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

వంద శాతం పంపిణీకి నిర్ణయం

మత్స్యకారుల ఉపాధికి అండగా నిలవాలని భావించిన ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో ఉచితంగా చేపపిల్లలను వదులుతుంది. చెరువుల్లో 35 నుంచి 45 మిల్లీమీటర్ల సైజ్‌తో కూడిన కట్ల, రవ్, బంగారుతీగ చేపలను వదలనుండగా, సాత్నాల, మత్తడివాగు వంటి ప్రాజెక్టుల్లో 80 నుంచి 100 మిల్లీమీటర్ల సైజుతో కూడిన కట్ల, రవ్, మృగాల వంటి చేపలను వదులుతున్నారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 87లక్షల చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేయగా వివిధ కారణాలతో ప్రభుత్వం అందులో సగం 43లక్షలు మాత్రమే వదిలింది. లక్ష్యం తగ్గిపోవడంతో పూర్తిస్థాయి చెరువుల్లో కాకుండా కేవలం 126 చెరువుల్లో మాత్రమే వదిలారు. టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడం, ఆలస్యంగా సీడ్ వదలడంతో చేప పిల్లలు చనిపోయి కేవలం 30 శాతం మాత్రమే పంపిణీ జరిగినట్లుగా మత్స్యకారులు చెబుతున్నారు. అయితే ఈఏడాది అలాంటి పరిస్థితికి తావివ్వకుండా 1.16 కోట్ల చేప పిల్లలను వదలాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేయగా ప్రభుత్వం సైతం ఆమోదం తెలిపింది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు..

ఆయా జలాశయాల్లో వదిలేందుకు అవసరమైన చేపపిల్లల సీడ్ సరఫరా చేసేందుకోసం ప్రభుత్వం ఏటా మే నెలలో టెండర్లు నిర్వహిస్తుంది. అయితే ఈ ఏడాది ఇప్పటికి రెండుసార్లు టెండర్లను ఆహ్వానించగా ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. మొదటి సారి కేవలం ఒకే ఒక బిడ్ దాఖలైంది. రెండోసారి కాంట్రాక్టర్ల నుంచి స్పందన కొరవడంది. ఒక్కరుకు కూడా ముందుకు రాలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం మరోసారి టెండర్ల నిర్వహణకు ఆదేశించింది. ఈమేరకు అధికారులు ఆ దిశగా కసరత్తు చేపట్టారు. టెండర్ దాఖలకు ఈనెల 12 వరకు గడువు విధించారు. అయితే గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చేపల ఎదుగుదలపై ప్రభావం

సహజంగా ఆగస్టులో చేప పిల్లలను చెరువుల్లో వదిలితే అవి మార్చి నాటికి ఎదిగి విక్రయించేందుకు అనుకూలంగా ఉంటాయని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రస్తుతం సెప్టెంబర్ వచ్చినా టెండర్ల ప్రక్రియ ఖరారు కాలేదని, అక్టోబర్, నవంబర్‌లో వదిలితే వేసవి వరకు అవి ఎదగవని, తద్వారా నష్టమే వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా టెండర్ల ప్రక్రియ వేగవంతం చేసి త్వరితగతిన చెరువుల్లోకి మీనం చేర్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకొస్తేనే

జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులు పూర్తిగా నిండటంతో ప్రభుత్వం ఈ ఏడాది వంద శాతం చేపపిల్లల సీడ్ పంపిణీకి అనుమతి ఇచ్చింది. దీంతో కోటి 16లక్షల సీడ్ సరఫరా కోసం టెండర్లు ఆహ్వానించాం. ఇప్పటికి రెండు సార్లు పిలువగా ఒకే బిడ్ దాఖలైంది. తాజాగా మూడోసారి ఆహ్వానిస్తున్నాం. ఈ నెల 12వరకు దాఖలు చేయవచ్చు. టెండర్లు ఖరారైన వెంటనే సీడ్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం.
– భాస్కర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

నాణ్యమైన విద్యుత్ అందించాలి



సమస్యలను విన్నవిస్తున్న వినియోగదారులు

ఆదిలాబాద్‌రూరల్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్ పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. మావల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మావల, ఆదిలాబాద్ రూరల్, టౌన్‌3 ఏడీఈ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక మంగళవారం నిర్వహించారు. ముందుగా డివిజనల్ పరిధిలోని డీఈ, ఏఈ, ఏవోలతో ఆయన సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యుత్ కనెక్షన్లు అందించడంలో జాప్యం, సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన పలువురు అధికారుల తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, పలువురు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఈ సందర్భంగా వారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజగౌడ్, సీఈ కేఆర్ చౌహాన్, డీఈ ఈదన్న, ఏవోలు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి సాగు చేస్తున్న ఒకరి రిమాండ్

లింగాపూర్: గంజాయి సాగు చేస్తున్న ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు జైనూర్ సీఐ రమేశ్, లింగాపూర్ ఎస్సై గంగన్న తెలిపారు. లింగాపూర్ మండలం ఎల్లాపటార్ గ్రామానికి చెందిన షేక్ మహెబూబ్ తన పంటచేనులో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడని తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి తనిఖీ చేయగా 24 గంజాయి మొక్కలు లభ్యమైనట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో ముగ్గురు..

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయినగర్‌కు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. కాలనీకి చెందిన అక్షయ్‌కుమార్ అదే కాలనీకి చెందిన యువతిని ప్రేమపేరుతో వేధిస్తుండగా బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొద్ది రోజుల తరువాత కేసులో రాజీ పడాలని నిందితుడు యువతిని బెదిరించడంతో మళ్లీ ఫిర్యాదు చేసింది. సోమవారం రాత్రి బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో పాటు తండ్రి రవీందర్‌పై నిందితుడు అతని సోదరులు సంజయ్, విజయ్‌లతో కలిసి దాడికి పాల్పడ్డాడు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను మంగళవారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

అడ్వకేట్‌పై దాడిచేసిన మహిళపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో అడ్వకేట్‌పై దాడిచేసిన మహిళపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. కేఆర్‌కే కాలనీకి చెందిన మహిళకు నాన్ బెయిలెబుల్ నోటీసు అందజేయడానికి అడ్వకేట్ కమిషన్ ఠాకూర్ కౌషిక్ వెళ్లడంతో ఆయనపై సదరు మహిళ దాడికి పాల్పడింది. దీంతో కౌషిక్ ఫిర్యాదు మేరకు మహిళపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అయ్యప్ప ఆలయంలో చోరీ

తలమడుగు: మండలంలోని సుంకిడి అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగినట్లు ఇన్‌చార్జీ ఎస్సై జీవన్ రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చొరబడి హుండీని పగులగొట్టి రూ.20వేల నగదు, రూ.50వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలను దొంగలించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా అయ్యప్ప ఆలయంలో చోరీ జరగడం ఇది మూడవసారి.

సైబర్ వలలో నిరుద్యోగి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఓ నిరుద్యోగి సైబర్ మోసగాళ్ల చేతిలో చిక్కాడు. తన వాట్సాప్‌కు ఏప్రిల్ నెలలో హాయ్ అంటూ మెస్సేజ్ వచ్చింది. జాబ్ ఆఫర్స్ ఉన్నాయని తెలుపడంతో స్పందించాడు. ఆన్‌లైన్‌లో మొదట రూ.5వేలు పంపించాల్సి ఉంటుందని, ఇంటి వద్ద నుంచే పని చేయాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించి వేతనం చెల్లించడం జరుగుతుందని సూచించారు. మొత్తం ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ.98వేలు ఆన్‌లైన్‌లో సదరు యువకుడు చెల్లించినా ఎలాంటి ఉద్యోగం కల్పించలేదు. తీరా మోసపోయానని తెలియడంతో మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

నాందేడ్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఆలస్యం

ఆదిలాబాద్: దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ రైల్వే డివిజన్ విభాగంలో జరుగనున్న లైన్ బ్లాక్ పనుల కారణంగా ఆదిలాబాద్–హుజూర్ సాహెబ్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (17409) రైలు కొంత ఆలస్యంగా నడవనున్నట్లు నాందేడ్ రైల్వే డివిజన్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 15న మాల్‌టెక్డీ స్టేషన్ వద్ద 80 నిమిషాల పాటు, 17, 18 తేదీల్లో లింబగావ్ స్టేషన్ వద్ద 40 నిమిషాల పాటు, 24, 25, 26 తేదీల్లో బోల్దా స్టేషన్ వద్ద 30 నిమిషాల పాటు నిలిపివేయబడుతుందని వివరించింది. ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలను సవరించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

సంస్కృతి, సంప్రదాయాలపై టీచర్ల ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న ఎల్లన్న

నిర్మల్‌ఖిల్లా: రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్‌లో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ప్రదర్శనలో 'బోధనాభ్యసన ప్రక్రియలో పప్పెట్రీ (తోలుబొమ్మలాట)' అనే అంశంపై 15 రోజులపాటు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. 13 రాష్ట్రాల నుంచి 90 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. రాష్ట్రం నుంచి పది మంది ఉపాధ్యాయులు భాగస్వామ్యమవుతుండగా నిర్మల్ జిల్లా భైంసా మండలం వానల్‌పాడు ప్రాథమిక పాఠశాలకు చెందిన మాదరి ఎల్లన్న పాల్గొన్నారు. మంగళవారం వివిధ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేపట్టిన వీరి ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

ఆత్మహత్యే పరిష్కారం కాదు..

- ఒక్క క్షణం ఆలోచించండి
- సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చు..
- నేడు ఆత్మహత్యల నివారణ దినోత్సవం

జిల్లాలో 2023 నుండి 2025 ఆగస్టు వరకు ఆత్మహత్యలు

సంవత్సరం	ఆత్మహత్యలు
2023	414
2024	418
2025	275

మానసికంగా బలహీనంగా ఉన్నప్పుడు చిన్న సమస్య కూడా కొండంతగా కనిపిస్తుంది. దీనికి పరిష్కారం లేదేమో అనిపిస్తుంది. కానీ, ధైర్యంగా, మనో నిబ్బరంతో ఉంటే.. పెద్ద సమస్య కూడా చిన్నగా మారుతుంది. పరిష్కారం దొరుకుతుంది. కానీ నేడు చాలా మంది క్షణికావేశంలో, చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొనలేక ఆత్మహత్యే శరణ్యం అనుకుంటున్నారు. దీంతో జిల్లాలో ఆత్మహత్యల రేటు ఆందోళనకరంగా పెరుగుతోంది. ముఖ్యంగా 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గలవారిలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. బుధవారం ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కథనం. – మంచిర్యాలక్రైం

జిల్లాలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

- దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన వేనంక వినయ్‌బాబు (26) అదే గ్రామానికి చెందిన దుంపాటి హితవర్షిణి (20) ప్రేమించుకున్నారు. హితవర్షిని వ్యక్తిగత కారణాల వల్ల ఈనెల 7న రైలుకిందపడి ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలు లేని జీవితం తనకు వద్దనుకున్న వినయ్‌బాబు ఈనెల 8న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- మూడు నెలల కాలంలో జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థులు, ఓ ప్రైవేటు కళాశాల వసతి గృహంలో మరో విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనలు కలకలం రేపాయి.
- మంచిర్యాలకు చెందిన ఓ విద్యార్థిని హన్మకొండలో ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. అక్కడ చదవడం ఇష్టంలేక రెండు నెలల క్రితం హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది.



చిన్న సమస్యలు, పెద్ద నష్టాలు

జీవితంలో ఎదురయ్యే సవాళ్లు అందరికీ సహజం. పరీక్షల్లో తక్కువ మార్కులు, దాంపత్య కలహాలు, ప్రేమలో విఫలంకావడం, ఉద్యోగ అవకాశాలు దొరకకపోవడం, అప్పుల భారం, వ్యవసాయంలో నష్టాలు, ఇలాంటి సమస్యలు ఎవరినైనా కలవరపరుస్తాయి. కానీ ఈ సమస్యలు శాశ్వతం కాదు. క్షణికావేశంలో తీసుకునే తప్పుడు నిర్ణయాలు కుటుంబాన్ని, సన్నిహితులను శాశ్వత బాధలో ముంచెత్తుతాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు మంచిర్యాల జిల్లాలో 275 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇందులో ఎక్కువగా యువతే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

ఒక్క క్షణం ఆలోచిస్తే...

సమస్యలు ఎంత పెద్దవైనా, ఆలోచనాత్మకంగా విశ్లేషిస్తే పరిష్కారం దొరుకుతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా నిపుణులతో సమస్యను పంచుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఆరోగ్య సమస్యలైతే వైద్యులను సంప్రదించడం, కుటుంబ కలహాలైతే కౌన్సిలింగ్ తీసుకోవడం, ఉపాధి కోసం కొత్త అవకాశాలను వెతకడం వంటి చర్యలు సమస్యల నుంచి బయటపడేందుకు సహాయపడతాయి. ఆత్మహత్య ద్వారా సమస్యలు తొలగిపోవని, అది కేవలం కన్నవారికి, కుటుంబానికి జీవితాంతం బాధను మిగిల్చే చర్య అని గుర్తించాలి.

మార్పును గమనించాలి...

ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారి ఆలోచనలు భిన్నంగా కనిపిస్తాయి. వారిపై కన్నేసి ఉంచాలి. ఈ ఆలోచన కలిగిన వారు మనోవేదనకు గురవుతున్నట్లు అనిపిస్తే వారితో మాట్లాడి సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. కుటుంబ సభ్యులు ఓదార్చి కొండంత ధైర్యాన్ని ఇవ్వాలి. మేమున్నామంటూ భరోసా కల్పించాలి.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



నర్సింహారెడ్డి (ఫైల్)

ఇచ్చోడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి వద్ద చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని రెడ్డికాలనీకి చెందిన ఏనుగు నర్సింహారెడ్డి (21)మంగళవారం తెల్లవారుజామున మేనబావ అయిన విశాల్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి కారులో వస్తుండగా ఇందల్వాయి వద్ద రోడ్డు పక్కన ఆగి వున్న కంటెయినర్‌ను ఢీకొట్టారు. ఘటనలో నర్సింహారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా కారు నడుపుతున్న విశాల్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి తరలించారు. మృతుని తండ్రి కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా కారు నడిపిన విశాల్‌రెడ్డిపై, లారీ పార్క్ చేసిన ఆలాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. అంత్యక్రియల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, అడ్డి భోజారెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యవసాయ కూలీ..



రాజేందర్ (ఫైల్)

కడెం: గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కొండుకూర్ గ్రామానికి చెందిన సంగెం రాజేందర్ (36) మంగళవారం అదే గ్రామానికి చెందిన సంజీవ్‌రెడ్డి వరి పొలం చుట్టూ గ్రాస్‌కట్టర్‌తో గడ్డి కోస్తుండగా వ్యవసాయబావి పక్కన ఉన్న విద్యుత్ వైరు యంత్రానికి చుట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు ఆందోళన చేపట్టడంతో కడెం, దస్తురాబాద్ ఎస్సైలు సాయికిరణ్, సాయికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య నీరజ, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..



ప్రసాద్ (ఫైల్)

సోన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కడ్తాల్ గ్రామానికి చెందిన డీకొండ ప్రసాద్ (40) సోమవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని ముఠాపూర్‌లో గణేశ్ నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్నాడు. మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగివస్తుండగా కడ్తాల్ గ్రామ శివారులోని హరిత రిసార్ట్ వద్ద 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

నీటిగుంతలో పడి వృద్ధుడు..

నెన్నెల: నీటిగుంతలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు మారమ్మవాడకు చెందిన జంబి చీకటి (74) సోమవారం ఉదయం నెన్నెల శివారులోని పత్తి చేనుకు కాపలా వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భార్య పోసాని, కుమారుడు మల్లేశ్ వెతుకుతుండగా రోడ్డు పక్కన నీటిగుంతలో పడి మృతి చెంది కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి ఒకరు..

భైంసారూరల్: ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కోతల్‌గాం గ్రామానికి చెందిన చిట్టిల్‌వార్ గంగారాం(64)సోమవారం ఉదయం పశువులు మేపేందుకు గ్రామ సమీపంలోకి వెళ్లాడు. పక్కనే ఉన్న చెరువులో పశువులు దిగడంతో వాటిని ఒడ్డుకు చేర్చేక్రమంలో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఆచూకీ కోసం గాలించారు. మంగళవారం ఉదయం మృతదేహం నీటిపై తేలియాడడంతో పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య భారత్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు..

లక్ష్మణచాంద: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మామడ మండలంలోని నల్దుర్తికి చెందిన కొత్తపెల్లి ఉదయ్ కుమార్ (23) కొంతకాలంగా నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వద్ద పనిచేస్తున్నాడు. మంగళవారం పనినిమిత్తం నల్దుర్తికి వెళ్లి నిర్మల్‌కు బైక్‌పై వస్తుండగా లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్‌వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బావ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన దంపతులు ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడలో నివాసం ఉంటున్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో మంగళవారం ఉదయం చౌహాన్ పూజ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. సాయంత్రం వరకు రాకపోవడంతో ఆమె భర్త చౌహాన్ రాజేష్ టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఏటీఎం సెంటర్‌లో ఓ దుండగుడు చోరీకి విఫలయత్నం చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఒరిస్సాలోని బలేశ్వర్‌కు చెందిన బిప్లబ్ కుమార్ సోమవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని కిసాన్ చౌక్ ప్రాంతంలోని డీబీఎస్ ఏటీఎంలోకి చొరబడ్డాడు. గడ్డపారతో యంత్రాన్ని ధ్వంసం చేసి లాకర్‌ను పగులగొట్టేందుకు యత్నించాడు. ఆ సమయంలో అలారం మోగడంతో అక్కడి నుంచి పరుగులు పెట్టాడు. అప్రమత్తమైన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. నిందితుడిని రైల్వేస్టేషన్ సమీపంలో పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. చోరీకి యత్నించిన వీడియోలు సీసీకెమెరాలో రికార్డయ్యాయి. కాగా నిందితుడు వారం రోజుల క్రితం జిల్లా కేంద్రానికి రైలులో వచ్చినట్లు పేర్కొన్నారు. చోరీకి యత్నించగా పట్టుబడినట్లు సీఐ నాగరాజు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కడెం: మండలంలోని చిన్నక్యాంప్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిట్యాల్ గ్రామానికి చెందిన తొడసం రాజ్‌కుమార్, పందిరి నాగరాజుకు గాయాలయ్యాయి.కడెం నుంచి చిట్యాల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో చిన్నక్యాంప్ వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పికిందపడడంతో గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వాసుత్రికి, అక్కడి నుంచి నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరుచోట్ల పిడుగుపాటుతో రెండెద్దు మృతి

దహెగాం: మండలంలోని లగ్గాంలో అనల భీమయ్యకు చెందిన ఎద్దు పిడుగుపాటుతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు మంగళవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఎడ్లను పొలం గట్లపై మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి ఎద్దుపై పిడుగు పడడంతో మృతి చెందిందని వాపోయాడు. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లిలో పెరుక పుల్లయ్యకు చెందిన ఎద్దు మంగళవారం పిడుగు పాటుతో మృతి చెందింది. వ్యవసాయ పనులు చేస్తుండగా వర్షం రావడంతో ఎడ్లను చెట్టు కింద కట్టేశాడు. పిడుగు పడడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.45 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పిడుగుపాటుతో మహిళ..

బెల్లంపల్లిరూరల్: పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, తాళ్లగురిజాల ఎస్సై బండి రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లికి చెందిన గెల్లె పద్మ (43) మంగళవారం మరికొంత మంది మహిళలతో కలిసి అదేగ్రామానికి చెందిన ఆదిముల్ల మహేందర్ పత్తి చేనులో కలుపు తీసేందుకు వెళ్లింది. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడడంతో అక్కడికక్కడే మృత్యువాతపడింది. అప్పటి వరకు అందరితో కలిసి ఉన్న మహిళ ఒక్కసారిగా విగత జీవిగా మారడంతో తోటి మహిళలు రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. మృతురాలికి భర్త వెంకటి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాముకాటుతో రైతు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలికి చెందిన మారేండ్ల కిష్టు (59) అనే రైతు పాము కాటుతో మృతి చెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కిష్టు రోజు మాదిరిగానే సోమవారం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అటువైపు పశువులను మేపుతున్న కాపరులు కిష్టు కింద పడి ఉండడాన్ని గమనించారు. నోటిలో నుంచి నురుగు రావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుక్కలదాడిలో చుక్కల దుప్పి..

పెంచికల్‌పేట్: కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం పెంచికల్‌పేట్ అటవీ ప్రాంతం నుంచి మండల కేంద్రంలోకి వచ్చిన చుక్కలదుప్పిపై వీధి కుక్కలు దుప్పిపై దాడి చేసి గాయపర్చాయి. గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో దుప్పి కళేబరాన్ని ఖననం చేశారు.

ఉబికొస్తున్న గంగమ్మ

ఇచ్చోడ మండలంలోని మల్యాల్‌లో శ్మశాన వాటిక వద్ద ఉన్న బోరు బావిలో నుంచి నీరు ఉబికి వస్తోంది. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు పెరిగిపోయాయి. దీంతో బోరును కొట్టకుండానే నీళ్లు పైకి ఉబికి వస్తున్నాయి. – ఇచ్చోడ



బోరింగ్ కొట్టకుండానే వస్తున్న నీళ్లు

సొంతింటి పథకంపై అభిప్రాయ సేకరణ

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు కంపెనీ క్వార్టర్లు కావాలా, సొంతింటి పథకం కావాలా అనే దానిపై ఈనెల 11, 12 తేదీల్లో బ్యాలెట్ పద్ధతిలో కంపెనీ వ్యాప్తంగా అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు సీఐటీయూ కేంద్ర కమిటీ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్కే 7, ఎస్సార్పీ 3 గనులపై గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మికులు నచ్చిన అంశానికి ఓటేసి తమ అభిప్రాయం తెలియజేయాలని కోరారు. కార్మికులకు సొంతింటి పథకం సాధించడం కోసం అవసరమైతే అన్ని యూనియన్‌లను కలుపుకుని సమ్మెకు కూడా పిలుపునిస్తామన్నారు. కంపెనీ గడిచిన ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై గుర్తింపు సంఘం నాయకులు, ప్రాతినిధ్య సంఘాలు ఏమాత్రం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ నాయకులు కస్తూరి చంద్రశేఖర్, శ్రీపతి బానేష్, శ్రీధర్, వెంగళ శ్రీనివాస్, శైల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కవి 'తుమ్మల'కు కీర్తి పురస్కారం



తుమ్మల దేవరావు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావును ప్రతిష్టాత్మక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం వరించింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధరంగాల్లో కృషి చేస్తున్న 48 మందిని పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు పురస్కార గ్రహీతల వివరాలను మంగళవారం వెల్లడించారు. ఈ నెల 23, 24 తేదీల్లో రూ.5,116 నగదు, పురస్కారంతో సత్కరించనున్నారు. దేవరావు తన పరిశోధనలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 17 శాసనాలను వెలుగులోకి తీసుకొచ్చారు. 2000లో 'నిర్మల్ జిల్లా కథలు' పేరిట సుమారు 80 ధారావాహికలు ఆలిండియా రేడియోలో ప్రసారమయ్యాయి. శాతవాహన రాష్ట్రకోట, కాకతీయ, అసఫ్‌జాహీ, నిజాం, కళ్యాణి చాళక్యులకు సంబంధించిన అనేకమైన చారిత్రక అంశాలను నమోదు చేశారు. వీరి పరిశోధనలు గుర్తించిన తెలుగు విశ్వవిద్యాలయం 2024 సంవత్సరానికిగానూ కీర్తి పురస్కారానికి ఎంపిక చేసింది.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా హిమతేజ

ఆదిలాబాద్: తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంటులో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన క్రికెటర్ కొడిమెల హిమతేజ మంగళవారం మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. చెన్నయ్ వేదికగా హెచ్‌సీఏ, టీఎన్‌సీఏ ప్రెసిడెంట్ ఎలెవన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హెచ్‌సీఏ చాంపియన్‌గా నిలిచింది. మొదటి ఇన్నింగ్స్‌లో హిమతేజ 97 పరుగులతో సత్తా చాటాడు. ఫైనల్లో కీలక ఇన్నింగ్స్ ఆడి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. నిర్వాహకులు జ్ఞాపికతోపాటు రూ.10,000 నగదు బహుమతి అందజేశారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న హిమతేజ

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వైద్యాధికారి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నంనూర్‌లో గల చందనపూర్ పునరావాస కాలనీలో ఉన్న తెలంగాణ రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ గురుకుల పాఠశాలలోని 16 మంది విద్యార్థులు సోమవారం రాత్రి అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి 16 మందితో పాటు మిగతా విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నారని, తరగతి గదుల్లో దోమల మందు స్ప్రే చేయించడం వలన చిన్న అనారోగ్య సమస్య తలెత్తిందని, ఒక్క విద్యార్థికి మాత్రం కళ్లలో మంటలు ఉన్నందున చికిత్స అందించామని ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ అనిత తెలిపారు.

పాఠశాలను సందర్శించిన వైద్యాధికారి

అస్వస్థతకు గురైన విద్యార్థులను చూసేందుకు జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ అనిత పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉప్పొంగిన వాగు.. నిలిచిన రాకపోకలు



నిలిచిపోయిన వాహనాలు

సాత్నాల: భోరజ్ మండలం తర్నం వాగు మంగళవారం పొంగి పొర్లడంతో జాతీయ రహదారి 353బీపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కిలోమీటర్ల మేర, ట్రాఫిక్ జామ్‌అయింది. వాగులో నీరు తగ్గకపోవడంతో వందలాది మందిగంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. రూ.4.5 కోట్ల తో నిర్మించిన లోలెవల్ వంతెన ఉపయోగంలో లేకుండా పోయిందని వాహనదారులు వాపోతున్నారు.

గణేశ్ చందా కాజేసిన వ్యక్తులపై ఫిర్యాదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత గర్మిళ్ల హన్మన్ గుడి సమీపంలో ఏర్పాటు చేసిన గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం వసూల్ చేసిన చందా డబ్బులను కొందరు వ్యక్తులు కాజేశారని కమిటీ సభ్యుల్లో కొందరు ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగ వెలుగులోకి వచ్చింది. కమిటీ సభ్యుల కథనం మేరకు ఎనిమిదేళ్లగా వినాయకుడిని ప్రతిష్టిస్తుండగా ఏటా చందారూపంలో వచ్చిన డబ్బులు సుమారు రూ.10 లక్షల వరకు జమయ్యాయి. వీటికి సంబంధించిన లెక్కలు చెప్పాలని కమిటీ ప్రధాన సభ్యులను కోరగా చెప్పకుండా బెదిరింపులకు పాల్పడడంతో రామల్ల వెంకటరెడ్డి, ఆకెనపెల్లి మధు, ఎగ్గెన శ్రీధర్, పుప్పాల హరీష్‌పై కమిటీ సభ్యులు రాములు, రవి, అశోక్, స్వామి, మరి కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఏఎస్సై వెంకన్నగౌడ్‌ను వివరణ కోరగ ఫిర్యాదు అందింది వాస్తవమేనని, ఇరు వర్గాల వారిని విచారించనున్నట్లు తెలిపారు.

'3న దసరా సెలవు ఇవ్వాలి'

శ్రీరాంపూర్: అక్టోబర్ 3న దసరా సెలవు ఇవ్వాలని కోరుతూ హెచ్‌ఎంఎస్ నాయకులు మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్ డీజీఎం(ఈఅండ్ ఎం) రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి ఉందని, అదే రోజున దసరా పండుగ వచ్చిందన్నారు. కంపెనీ అక్టోబర్ 2న దసరా పండుగను గుర్తించడం వలన కార్మికులు పండుగ జరుపుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. డబ్ల్యూసీఎల్ సంస్థలో దీన్ని మార్పు చేశారని సింగరేణిలో కూడా 3న దసరా సెలవుగా ప్రకటించాలని కోరారు.

గోదావరిలో వివాహిత గల్లంతు..

దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరి నదిలో కుమురం భీం జిల్లా తిర్యాణి మండలం తలండి గ్రామానికి చెందిన వివాహిత పోలోజు శృతి(42) గల్లంతైనట్లు పోలీసులు, కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా శృతి మానసిక స్థితి బాగోలేదు. మంగళవారం పనిమీద బయటకు వెళ్లిన ఆమె భర్త వెంకటేష్ కొద్దిసేపటి తర్వాత ఇంటికి వెళ్లగా శృతి కనిపించలేదు. ఆచూకీ కోసం వెతుకుతుండగా గూడెం గోదావరి వంతెన వద్ద బ్యాగు, చెప్పులు కనిపించాయి. నదిలో దూకి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి ఆమె ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. గతంలో కూడా ఆత్మహత్యకు యత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దహెగాం: ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ బియ్యం అక్రమంగా తరలించి రైస్‌మిల్లు వద్ద అన్‌లోడ్ చేస్తుండగా సోమవారం రాత్రి ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు రాజ్‌కుమార్, శ్రీనివాస్ పట్టుకున్నట్లు తహసీల్దార్ మునవార్ షరీఫ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా జన్కాపూర్‌కు చెందిన వ్యాన్‌లో కన్నెపల్లి నుంచి 54 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలించి దహెగాంలోని వాసవి మోడ్రన్ రైస్ మిల్లులో అన్‌లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యానికి పంచనామా నిర్వహించి దహెగాం రేషన్ దుకాణం-1కు అప్పగించినట్లు తెలిపారు. రైస్‌మిల్లు యాజమాని సూర సందీప్, గుమస్తా విఘ్నేష్, వ్యాన్ యాజమాని రాకేశ్, డ్రైవర్ అభిషేక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం పులిమడుగులోని హెవెన్ ఆఫ్ హోప్ స్కూల్‌లో మంగళవారం అండర్–14, 17 జిల్లా స్థాయి బాల బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పరిశీలకులు పాల్గొన్నారు.